సాక్షి
జనగామ

శుక్రవారం | 25 | ఆగస్టు | 2023



చిగురించిన ఆశలు..

త్వరలోనే టీచర్ పోస్టుల భర్తీకి ఉపక్రమించబోతున్నట్లు విద్యాశాఖమంత్రి సబితాఇంద్రారెడ్డి గురువారం వెల్లడించారు.

- 8లో



మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- 8లో

రుణాలు పొందిన స్వయం సహాయక సంఘాల మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని మంత్రి దయాకర్‌రావు అన్నారు.

గరిష్టం/కనిష్టం $32^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉండి, సాయంత్రం ఆహ్లాదకరంగా మారుతుంది.

న్యూస్‌రీల్

ప్రజాగాయకుడు గద్దర్ స్ఫూర్తి మరువలేనిది



జనగామ రూరల్: గద్దర్ స్ఫూర్తి తెలంగాణ సమాజం మరువలేనిదని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని వైఎస్‌ఆర్ భవన్‌లో జాతీయ మానవ హక్కుల వేదిక, బహుజన విద్యార్థి వేదిక యాసారపు కర్నాకర్, తాళ్లపల్లి శివరాం అధ్యక్షతన ఏర్పాటు చేసిన గద్దన్ సంస్మరణ సభలో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో గద్దర్ పోరాటం మరువలేనిదన్నారు. అనంతరం గాయకుడు ఏపూరి సోమన్న మాట్లాడుతూ.. నిత్యం ప్రజల పక్షాన తన గొంతును వినిపించిన మహనీయుడు గద్దర్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల కళింగ రాజు, డాక్టర్ రాజమౌళి, నీర్మాల రత్నం, సోమేశ్వరాచారి, కృష్ణ, ఉపేందర్, కుమార్, మంగళంపల్లి రాజు, ఇరుగు యాకన్న పాల్గొన్నారు.

చీడపీడలపై అప్రమత్తంగా ఉండాలి



నర్మెట: పంటలను ఆశించే చీడపీడలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ అనిల్ కుమార్ తెలిపారు. జాగృతి ప్రాజెక్ట్‌లో భాగంగా బేయర్ క్రాప్‌సైన్స్, ఎల్‌డీసీ ఆధ్వర్యంలో మండలంలోని గుంటూరుపల్లిలో గురువారం రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పత్తిని ఆశించే చీడపీడల్లో ముఖ్యమైన గులాబిరంగు పురుగు ఉనికి, కల్గించే నష్టం, లింగాకర్షక బుట్టల ఏర్పాటు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. పత్తి విత్తిన 45 రోజుల్లో పురుగు ఆశించే అవకాశాలున్నందున అమర్చిన బుట్టలను గమనించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఉదయం, సాయంత్రం వేళలలో మాత్రమే వ్యవసాయ అధికారుల సూచనలు సలహాలతో మందులు పిచికారీ చేయాలని తెలిపారు. ఈసందర్భంగా 160 మంది రైతులకు ఒక్కొక్కరికీ 10 బుట్టలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఏఓ ధరావత్ సంతోషి, బేయర్ క్రాప్ సైన్స్ రీజనల్ మేనేజర్ రాజశేఖర్, మేనేజర్ లక్ష్మీనారాయణ, ఎల్డీసి ప్రతినిధి చిట్టిమల్లె అఖిలేష్, ఏఈఓలు ఎస్.బీనా, భూక్యా అనిత, రైతులు వెలంగిణి రెడ్డి, పాపిరెడ్డి, జోజిరెడ్డి, చిన్నపురెడ్డి, సుమన్ రెడ్డి, బాల్‌సింగ్, సంపత్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఎస్సైకి తప్పిన ప్రాణపాయం

- హెడ్‌కానిస్టేబుల్‌కు స్వల్పగాయాలు
- కారు డ్రైవర్‌కు దేహశుద్ధి చేసిన స్థానికులు



జనగామ : శాంతి భద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ కోసం పర్యవేక్షించే పోలీసు సిబ్బందిని ఓ కారు విచక్షణ రహితంగా ఢీ కొట్టడమేగాక ట్రాఫిక్ ఎస్సై తిరుపతిని లాక్కెళ్లిన సంఘటన గురువారం రాత్రి జనగామలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. జనగామ పట్టణంలో గిరిజనులు తీజ్ ఉత్సవాలు జరుపుకుంటున్న తరుణంలో స్థానిక ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి రాకతో ట్రాఫిక్ ఎస్సై తిరుపతి తన సిబ్బందితో ఆర్టీసీ చౌరస్తాలో పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలోనే సిద్దిపేట నుంచి సూర్యాపేట వైపు ఓ కారు రోడ్డు నిబంధనలు విస్మరిస్తూ అతివేగంగా వస్తుండగా హెడ్‌కానిస్టేబుల్ సంజీవ నివారించే ప్రయత్నం చేశాడు. కానీ, కారు ఆపకుండా అతన్ని ఢీ కొట్టడంతో స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటను చూసిన ఎస్సై తిరుపతి ఆ కారును ఆపి డ్రైవర్ నుంచి తాళాలు తీసుకునేందుకు యత్నిస్తుండగా ఆటోమెటిక్ కారుకావడంతో ఆపకుండా గ్లాసులు ఎత్తుతూ వెళ్లేందుకు యత్నించాడు. ఈ క్రమంలో సదరు ఎస్సై చేయి కారు డోర్‌లో ఇరుక్కోవడంతో 50 మీటర్ల దూరం వరకు అలాగే ఎస్సై పరుగెత్తాడు. ఈ క్రమంలో కారు మరో బైకును ఢీ కొట్టింది. ఇదంతా గమనించిన స్థానికులు అప్రమత్తమై కారును అడ్డుకోగా.. ఇద్దరు పరారుకాగా.. డ్రైవర్‌కు దేహశుద్ధి చేశారు. ఎట్టకేలకు పోలీసులు కారు, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

ఇన్‌ఫ్లో తగ్గుముఖం

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని బ్యారేజీకి ఇన్‌ఫ్లోలు తగ్గుముఖం పట్టాయి. అన్నారం (సరస్వతీ) బ్యారేజీకి గోదావరి, మానేరుల గుండా 22,074 క్యూసెక్కులు, మేడిగడ్డ(లక్ష్మీ) బ్యారేజీకి ప్రాణహిత ఇన్‌ఫ్లో 1,58,230 క్యూసెక్కులు తరలిపోతుంది. దీంతో ఆయా బ్యారేజీల్లో గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు.

మరింత ‘ఆసరా’

పింఛన్ పెంపుతో లబ్ధిదారుల ఆనందం
- జిల్లాకు అదనంగా రూ.1.10 కోట్లు
- 11,056 మందికి ప్రయోజనం



నెల్లుట్లలో పింఛన్ తీసుకుంటున్న దివ్యాంగులు(ఫైల్)

జనగామ రూరల్: గత ప్రభుత్వాల హయాంలో దివ్యాంగులకు ఎలాంటి ఆదరణ లేకుండా అనేక ఇబ్బందులు పడేవారు. ప్రత్యేక రాష్ట్ర సాధన అనంతరం బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆసరా పింఛన్ నగదు పెంచింది. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కొంత పెంచి పింఛన్ లబ్దిదారులకు భరోసా కల్పించారు. అయితే స్వరాష్ట్రంలో దివ్యాంగులకు పింఛన్ పెంచాలనే ఉద్దేశ్యంతో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ బాధ్యతలు చేపట్టగానే దివ్యాంగులకు నెలకు రూ.3,016, ఇతరులకు రూ.2,016 అమలు చేస్తున్నారు. ప్రస్తుతం రూ.3016 ఉన్న మొత్తాన్ని వెయ్యి పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. దీంతో దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నార. పింఛన్‌తోపాటు ఉపకరణాలు, వాహనాలు, ఇతర రూపాల్లో ప్రభుత్వం చేయూతనిస్తుంది.

జిల్లాలో 11,056 మందికి లబ్ధి

ప్రభుత్వ నిర్ణయంతో జిల్లా వ్యాప్తంగా 12 మండలాల్లో మొత్తం 11,056 మంది దివ్యాంగులకు ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం ప్రభుత్వం నెలనెలా ఆసరా పథకంలో భాగంగా రూ.3,016 చొప్పున జిల్లాకు రూ.3.33కోట్లు కేటాయిస్తుంది. ఈలెక్కన రూ.వెయ్యి పెంపుతో ప్రభుత్వంపై అదనంగా రూ.1.10 కోట్ల భారం పడనుంది.

పెరగనున్న దరఖాస్తులు

దివ్యాంగులకు రూ.3,016 పింఛన్‌తో టు బస్సు, రైల్వే ప్రయాణాల్లో రాయితీలు ఉన్నాయి. దీంతో చాలా మంది సదరం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం 40శాతం వైకల్యం ఉంటేనే పింఛన్‌తోపాటు అన్ని రకాల రాయితీలు లభిస్తాయి. సెప్టెంబర్ నుంచి రూ.4,016 పింఛన్ అందజేస్తామన్న సీఎం కేసీఆర్ ప్రకటన నేపథ్యంలో మరికొంతమంది అర్హులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. జిల్లాలో చాలా మంది అర్హులైన దివ్యాంగులు ఉన్నారని.. వారికి సదరం ధ్రువపత్రాలు రావల్సి ఉందని దివ్యాంగ సంఘ నాయకులు తెలుపుతున్నారు. గ్రామాల్లోనే సదరం క్యాంపులు నిర్వహించి ధ్రువపత్రాలు అందించాలని కోరుతున్నారు.

దివ్యాంగులకు తోడ్పాటు



సమాజంలో గౌరవంగా జీవించగానికి ఎలాంటి ఆధారం లేని వారికి పింఛన్ పెంపుదల మరింత తోడ్పాటు కలిగిస్తుంది. కుటుంబ పోషణకు ఆసరా అందించినట్టు అవుతుంది. కేసీఆర్ గొప్ప నిర్ణయం తీసుకున్నారు.

- మేకల సమ్మయ్య, తెలంగాణ వికలాంగుల వేదిక వ్యవస్థాపకుడు

భరోసా ఉంటుంది..



జిల్లా వ్యాప్తంగా దివ్యాంగులు మొత్తం 11,056 మంది ఉండగా వారికి ప్రతినెలా రూ.3,016 అందజేస్తున్నాం. ప్రభుత్వం పెంచిన రూ.వేయితో దివ్యాంగులకు ఆర్థికంగా మరింత భరోసా కలగనుంది. ఈనెలలో బ్యాంకుల్లో డబ్బులు జమ అయ్యాయి.

- డీఆర్‌డీఓ రాంరెడ్డి, జనగామ

కేసీఆర్‌కు రుణపడి ఉంటాం



పుట్టకతోనే రెండు కాళ్లు పడిపోయాయి. తల్లిదండ్రులు లేరు. మూడు ఏళ్ల క్రితం దివ్యాంగుడిని వివాహం చేసుకున్నాను. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రూ.3,016 అందిస్తుండగా మాకు రూ.6వేలు వచ్చేవి. ప్రస్తుతం మరింత ఎక్కువ వస్తాయి.. ఆనందంగా ఉంది.. సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం.

- ఇమ్మడి మైసమ్మ, జనగామ పట్టణం

కేసీఆర్ మనుషుల్ని నమ్మరు

- హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్
- ఎన్‌కౌంటర్ అనే పదానికి విస్తృత ప్రచారం చేసింది కడియం శ్రీహరి
- దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

స్టేషన్‌ఘన్‌పూర్: సీఎం కేసీఆర్ మనుషుల్ని నమ్మడని, మద్యం, డబ్బునే నమ్ముతాడని, కులానికి, మనిషికి వెల కడతాడని హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ నియోజకవర్గ బూత్‌స్థాయి సమావేశాన్ని డివిజన్ కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం నిర్వహించారు. ఎస్సీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్ జితేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఈటల మాట్లాడారు. మాటలకు చేతలకు సంబంధం లేని వ్యక్తి కేసీఆర్ అని, దశాబ్ది ఉత్సవాల పేరిట గ్రామాల్లో డబ్బులు వసూలు చేసుకుని దావత్‌లు చేశారని ఆరోపించారు. గ్రామాల్లోకి గంజాయి వచ్చిందని, పాన్ డబ్బాల్లో గంజాయి దొరుకుతుందని, ఈ ప్రభుత్వం ఇలానే కొనసాగితే రాష్ట్రం వల్లకాడు అవుతుందన్నారు. బీజేపీ ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న పార్టీయని, ఇక్కడ పెద్ద పర్సనాలిటీలు అవసరం లేదని, అందుకు తానే నిదర్శనమన్నారు. ప్రజలే హీరోలని అన్నారు. అటుకులు తిని ఉద్యమం చేసిన కేసీఆర్ అవినీతి పాలన, అక్రమాలతో లక్షల కోట్లకు అధిపతి అయ్యాడని ఆరోపించారు. దేశంలో అన్ని పార్టీలకు నాయకుడిని చేయండి ఎన్నికల ఖర్చు పెడుతా అంటున్నాడని, దీనిపై చర్చ జరగాలన్నారు. ప్రస్తుతం కేసీఆర్ పార్టీ అకౌంట్‌లో రూ.850 కోట్లు ఉన్నాయని, అవి ఎలా వచ్చాయో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ధరణి వచ్చిన తర్వాత లక్షల కోట్ల విలువైన భూములను కబ్జా చేశారని ఆరోపించారు. 17 శాతం ఉన్న దళితులలో 11 శాతం ఉన్న మాదిగలకు ఎన్ని పదవులు ఇచ్చారని ప్రశ్నించారు. బీజేపీలో పేదలు, దళితులు, గిరిజనులు, బీసీలకు పదవులు వస్తాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్నీ స్కాములే ఉంటాయన్నారు. దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు మాట్లాడుతూ.. గతంలో ప్రజలకు ఎన్‌కౌంటర్ అంటే పెద్దగా తెలియదని, దానికి విస్తృత ప్రచారం చేసింది దళిత ద్రోహి, దళిత దొర కడియం శ్రీహరి అని అన్నారు. మంత్రిగా ఘన్‌పూర్‌కు ఏమిచేశారో శ్రీహరి చెప్పాలన్నారు. వాళ్ల పార్టీ వారే కడియంను ఓడిస్తారని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు దశమంత్‌రెడ్డి, కొప్పు బాషా, కపిలవాయి దిలీప్‌కుమార్, గుండె విజయరామారావు, సాంబమూర్తి, వెంకటేష్, సుభాష్, రమేష్, అంజిరెడ్డి, యుగేందర్‌రెడ్డి, కృష్ణ, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

భారత శాస్త్రవేత్తలకు దక్కిన ఘనత

- దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



మాట్లాడుతున్న రఘునందన్‌రావు

జనగామ: చంద్రయాన్–3 విజయవంతం భారత శాస్త్రవేత్తలకు దక్కిన ఘనత అని దుబ్బాక బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర పర్యటన నేపథ్యంలో ఆయన గురువారం జనగామ ఆర్టీసీ చౌరస్తాలో ఆగగా, జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వారికి నచ్చిన రంగంలో చదివి భారత దేశ కీర్తిని ప్రపంచానికి చాటాలన్నారు. ఈ ఘనత సాధించిన ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు జాతీయ జెండాలు పట్టుకుని టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు.

కడియం శ్రీహరి వైఖరి మార్చుకోవాలి

- జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి



విలేకర్లతో మాట్లాడుతున్న మారపాక రవి

స్టేషన్‌ఘన్‌పూర్: ఎమ్మెల్సీ కడియం శ్రీహరి తన వైఖరిని మార్చుకోవాలని, ఎమ్మెల్యే రాజయ్యను, రాజయ్య వర్గీయులను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్, ఘన్‌పూర్ జెడ్పీటీసీ మారపాక రవి అన్నారు. కడియం శ్రీహరి వైఖరికి నిరసనగా వివిధ మండలాలకు చెందిన రాజయ్య వర్గీయులైన జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ప్రజాప్రతినిధులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమీపాన ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యన మాట్లాడుతూ.. ఎన్నికలు వచ్చినప్పుడు నాయకులు టికెట్లు ఆశించడం సహజమని, పార్టీ అధినేతలు నిర్ణయించిన వారికి టికెట్ వస్తుందని, ఘన్‌పూర్ నియోజకవర్గంలోనూ గత కొన్నేళ్లుగా అదే జరుగుతుందన్నారు. గత ఎన్నికల్లో టికెట్ కోసం రాజయ్య, శ్రీహరి పోటీ పడ్డారని, రాజయ్యకు టికెట్ వస్తే శ్రీహరి ఆశీర్వాదం తీసుకుని ఎన్నికల్లోకి వెళ్లారని, ఎక్కడా ఎవరినీ కించపరచలేదన్నారు. కానీ, ప్రస్తుతం కడియం శ్రీహరి వైఖరి అందుకు విరుద్ధంగా ఉందని, రాజయ్యను, రాజయ్య వర్గీయులను కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. బుధవారం ఘన్‌పూర్‌లో కడియం శ్రీహరి వస్తున్న సందర్భంగా ర్యాలీ, సభ పెట్టుకున్నారని, స్థానిక ఎమ్మెల్యే రాజయ్యకు సమాచారం ఇవ్వలేదని, ఫ్లెక్సీల్లో ఎక్కడా రాజయ్య ఫొటో పెట్టలేదన్నారు. రానున్న ఎన్నికల్లో రాజయ్య అవసరం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. విమర్శలు చేయాలనుకుంటే రాజయ్య సైతం చేయగలరని, అధిష్టానం ఆదేశాల మేరకు మౌనంగా ఉంటున్నారని, సీఎం కేసీఆర్ రాజయ్యకు న్యాయం చేస్తారనే నమ్మకం ఉందన్నారు. సరైన న్యాయం జరుగకుంటే రాజయ్య ఏ నిర్ణయం తీసుకున్నా ఆయనతోనే ఉంటామని, సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవాలని రాజయ్యను కోరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గుజ్జరి రాజు, జెడ్పీటీసీలు చాడ సరిత, ఇల్లందుల బేబీ, ఎంపీపీలు కందుల రేఖ, చిట్ల జయశ్రీ, సమ్మిరెడ్డి, సర్పంచ్ తాటికొండ సురేష్ పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చందు

జనగామ రూరల్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హమీలు అమలు చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని రైతు సంఘ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పి రైతు వ్యతిరేక నల్ల చట్టాలు తేవడం దారుణం అని అన్నారు. కేరళ తరహాలో రైతులను ఆదుకోవాలన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ రైతులను పట్టించుకోవడం లేదని రుణమాఫీలో అనేక లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. వడగండ్ల వాన, భారీ వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సారయ్య, మీట్యా నాయక్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీలత పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నం

- అడ్డుకున్న పోలీసులు
- బీజేపీ నాయకుల అరెస్టు



బీజేపీ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

పాలకుర్తి టౌన్: అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం బీజేపీ నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నించారు. వర్ధన్నపేట ఏసీపీ సురేష్, సీఐ విశ్వేశ్వర్ ఆధ్వర్యంలో పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పల ఎస్సైలు తాళ్ల శ్రీకాంత్, యాకుబ్‌హుస్సేన్, బండి శ్రావణ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నించిన బీజేపీ నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. క్యాంపు కార్యాలయం ముట్టడిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లేగ రామ్మోహన్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ పూసాల శ్రీమాన్, సుంకరనేని కోటేశ్వర్, రంగు రాముగౌడ్, దొంగరి మహేందర్, ఝాన్సీ, గద్దం నరేందర్, పాలకుర్తి మండల అధ్యక్షులు కమ్మగాని శ్రీకాంత్, దుంపల సంపత్, నిరజంన్‌రెడ్డి, బచ్చు సురేష్, వడ్లకొండ రవి, బాగాల నవీన్‌రెడ్డి, పులిగిల్ల ఉపేందర్, శ్రీను, దినేష్, అశోక్, సంతోష్, కొండా యాకయ్య పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 13 మంది డీబార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో గురువారం నిర్వహించిన దూరవిద్య (ఎస్‌డీఎల్‌సీఈ) బీఏ, బీకాం, బీఎస్సీ ఫస్టియర్ పరీక్షల్లో 13 మంది విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడి డీబార్ అయ్యారని పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు. వరంగల్ ఎల్‌బీ కళాశాలలో ఆరుగురు, ఏఎస్‌ఎంలో ఐదుగురు, సీకేఎంలో ఇద్దరు స్క్వాడ్‌కు పట్టుబడినట్లు పేర్కొన్నారు.

పండ్ల తోటలకు ప్రోత్సాహం

సన్న చిన్నకారు రైతులకు అవకాశం
- 13 రకాల తోటలకు ప్రత్యేక రాయితీలు
- ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉన్నవారికి ప్రాధాన్యత
- ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు



పండ్ల తోటను పరిశీలిస్తున్న అధికారి(ఫైల్)

జనగామ రూరల్: పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రాయితీలు కల్పిస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ, సన్నకారు రైతులు, ఐదెకరాల లోపు ఉన్నవారు, ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన వారికి అవకా శం కల్పిస్తోంది. జిల్లాలో ఎక్కువగా వరి సాగవుతోంది. దీనికి ప్రత్యామ్నాయంగా హార్టికల్చర్ ద్వారా 13 రకాల పండ్ల తోటల పెంపకం చేపట్టాలని నిర్ణయించి ఉపాధి హామీ పథకం కింద పనులు చేయిస్తున్నారు. ఇందులో ముఖ్యంగా మామిడి, నిమ్మ, నారింజ, జీడీమామిడి, జామ, సీతాఫలం, సపోట, ఆయిల్‌పామ్, నేరేడు, ఆపిల్, దానిమ్మ, మునగ, డ్రాగన్ ఫ్రూట్, కొబ్బరి తోటల పెంపకం చేపట్టనున్నారు. సాగు చేసే రైతులకు ప్రభుత్వం నాలుగేళ్ల పాటు ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నది. మొక్కలు నాటిన దగ్గర నుంచి వాటి సంరక్షణ కింద ఉపాధి పథకం ద్వారా వివిధ రూపాల్లో సహాయం అందిస్తుంది. ఈ పథకంపై కలెక్టర్ శివలింగయ్య, ఉపాధి హామీ, ఉద్యానవన శాఖ అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

రైతులకు రాయితీ ఇలా..

- పండ్ల మొక్కల పెంపకానికి ముందు మట్టి పరీక్ష, మొక్కలకు గుంతలు తీయడం, నాటేందుకు ప్రభుత్వం సహకరిస్తుంది.
- ఒక్కో మొక్కకు ఎరువుకు రూ.50, సంరక్షణకు రూ.10 చొప్పున మూడేళ్లు ఇస్తారు. ఆపిల్‌బేర్, దానిమ్మ తోటలకు రెండేళ్ల పాటు ఎరువుల తోపాటు రక్షణ కల్పిస్తారు. అలాగే మునగకు ఏడాది పాటు ఉంటుంది.
- మొక్కలకు నీరు అందించడానికి డ్రిప్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం, బీసీలకు 90 శాతం రాయితీ ఉంటుంది.
- రైతులు తప్పనిసరి ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగి ఉండాలి. పండ్లతోటల పెంపకానికి అనువైన భూమి, నీటి వసతి, అలాగే ఐదు ఎరకాల లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలు, సన్న కారు రైతులు అర్హులు.

అంతర పంటలకు అవకాశం

పండ్ల తోటల్లో అంతర పంటలుగా ఆకుకూరలు, బీర, బెండ, సొర, కాకర, చిక్కుడు, టమాట, పచ్చిమిర్చి, దోస, పూలు వంటివి వేసుకోవడం వల్ల సీజన్ వారీగా ఆర్థిక వేసులుబాటు పొందవచ్చు. వీటికి కూడా ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందుతుంది.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం తగిన ఆర్థిక సహాయం సమకూర్చుతోంది. 13 రకాల పండ్ల తోటల పెంపకానికి అవకాశం ఉంది. ఉపాధి హామీ జాబ్‌కార్డు, ఐదేకరాల లోపు భూమి కలిగిన వారు అర్హులు. ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం, బీసీలకు 90 శాతం రాయితీపై డ్రిప్‌కు అవకాశం కల్పిస్తుంది. ఆసక్తి ఉన్నవారు జీపీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏపీఓలు, ఏఓలు, ఏఈఓల్లో ఎవరినైనా సంప్రదించవచ్చు.

- కేఆర్.లత, జిల్లా ఉద్యానవన అధికారి

రాయితీ వివరాలు
ఒక్కో ఎకరానికి(రూ.ల్లో)

పంట	రాయితీ
మామిడి	54,606
నిమ్మ	69,403
నారింజ	63,118
జామ	70,063
సీతాఫలం	1,00,986
సపోట	47,264
ఆయిల్‌పామ్	43,946
నేరేడు	31,120
ఆపిల్ బేర్	77,786
దానిమ్మ	1,21,499
మునగ	94,892
డ్రాగన్ ఫ్రూట్	2,50,272

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మయ్య



మాదాపురంలో సభ్యత్వ నమోదు చేస్తున్న లక్ష్మయ్య

దేవరుప్పుల : ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వ వివక్ష తగదని తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల లక్ష్మయ్య విమర్శించారు. మండల కేంద్రంతోపాటు వివిధ పాఠశాలల్లో గురువారం నిర్వహించిన టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యాశాఖలో పదోన్నతులు, బదిలీలు చేపట్టకుండా వ్యవస్థను నిర్వీర్యం చేసే కుయుక్తులను అధిగమించేందుకు న్యాయపరమైన హక్కుల సాధనకు ఉపాధ్యాయ సంఘాలు ఐక్యసంఘటన కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలు భర్తీ చేసి పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మణ్‌జీ, జోగు వరప్రసాద్, రాజేందర్‌కుమార్, వీరారెడ్డి, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, నవీన్ కుమార్, రాజేందర్ పాల్గొన్నారు.

బంజారా నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు



ఘనంగా తీజ్ వేడుక



గిరిజన(లంబాడ) యువతులు ఇష్టంగా జరుపుకునే వేడుక తీజ్. గోదుమ నారును తొమ్మిది రోజులు పెంచిన అనంతరం నిమజ్జనంతో ముగిసే పండుగ తీజ్. ఈవేడుకను గిరిజన యువతులు అత్యధికంగా పాల్గొని, సంప్రదాయ నృత్యాలు, పాటలతో చెరువు వద్దకు వెళ్లి నిమజ్జనం చేస్తారు. గురువారం రాత్రి జిల్లాలోని పలు తండాల్లో మహిళలు, యువతులు తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు.

- జనగామ రూరల్

మాజీ కార్పొరేటర్‌పై కేసు

ఖిలా వరంగల్ : వరంగల్ లక్ష్మీనగర్ శాకరాసి కుంట సమీపంలోని ఓ నిర్జీవ ప్రదేశంలో బుధవారం రాత్రి కారు పార్క్ చేసి మద్యం సేవిస్తున్న ఓ మాజీ కార్పొరేటర్‌పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదైంది. మద్యం సేవిస్తూ పోలీసులను చూసి కారులో ముందుకెళ్తున్న ఆయనను పట్టుకుని మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం అతడిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి గురువారం తెల్లవారు జామున వదిలేసినట్లు సీఐ టి. సురేష్ తెలిపారు. ఇదిలా ఉండగా ఆ మాజీ కార్పొరేటర్ రెండు నెలల క్రితమే బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

అల్లుడి దాడి.. అత్త మృతి

రామన్నపేట : అల్లుడి దాడిలో అత్త మృతి చెందింది. మట్టెవాడ ఎస్సై నవీన్ కథనం ప్రకారం వృద్ధురాలు సామల వెంకటమ్మ (78) తన నాలుగో కూతురు వంగ సునీతతో కలిసి వరంగల్ సుజిత్‌నగర్‌లో నివాసముంటోంది. సునీత భర్త సంపత్ నిత్యం వెంకటమ్మను దూషించడంతోపాటు ఘర్షణకు దిగేవాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం సంపత్ తన భార్య, కొడుకును ఓ గదిలో ఉంచి వెంకటమ్మ తలపై సుత్తితో కొట్టాడు. తీవ్రగాయాలపాలైన వృద్ధురాలిని వెంటనే ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందింది. మృతురాలి పెద్ద కూతురు దేవులపల్లి శోభరాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మట్టెవాడ ఎస్సై నవీన్ తెలిపారు.

చిగురించిన ఆశలు..

- టీచర్‌పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్
- డీఎస్సీతోనే నియామకం
- రెండు రోజుల్లో విధివిధానాలు ఖరారు?



విద్యారణ్యపురి: సుదీర్ఘకాలంగా టీచర్ పోస్టుల భర్తీ కోసం నిరీక్షిస్తున్న డీఎడ్, బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులకు శుభవార్త. త్వరలోనే ఈ పోస్టుల భర్తీకి ఉపక్రమించబోతున్నట్లు విద్యాశాఖమంత్రి సబితాఇంద్రారెడ్డి గురువారం వెల్లడించారు. అయితే ఈసారి టీఆర్‌టీ ద్వారా కాకుండా పాతపద్ధతి డీఎస్సీ ద్వారానే భర్తీచేయబోతున్నారు. రాతపరీక్ష అనంతరం జిల్లా సెలక్షన్ కమిటీ భర్తీ చేయనుంది. అందుకు రెండు మూడురోజుల్లో కలెక్టర్లు విధివిధానాలు ప్రకటిస్తారని సమాచారం. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బీఈడీ, డీఎడ్ పూర్తిచేసిన అభ్యర్థుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటికే టీచర్ ఎలిజిబులిటీ టెస్టు (టెట్) నిర్వహణకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. ఈఏడాది సెప్టెంబర్15న టెట్ నిర్వహిస్తారు. అదే నెలలో 27న ఫలితాలను విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో టెట్‌కు అభ్యర్థులు ప్రిపేర్ అవుతున్నారు. ఇప్పుడు టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ కూడా రానుండడంతో ఆయా అభ్యర్థుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

జిల్లాలవారీగా ఎన్ని వెకెన్సీలు భర్తీచేస్తారు!

ఉమ్మడి వరంగల్ జిల్లాలో డీఎడ్, బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులు వేలాది మంది ఉన్నారు. దీంతో వీరు కొన్నేళ్లుగా టీచర్ పోస్టుల భర్తీ కోసం నిరీక్షిస్తున్నారు. 2017లో టీఆర్‌టీ ద్వారా టీచర్ల పోస్టుల భర్తీ చేశాక మళ్లీ ఇప్పటి వరకూ జరగలేదు. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆరు జిల్లాలుగా హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగామ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి విభజించబడింది. ఈ నేపథ్యంలో ఏ జిల్లా నియామకాలు ఆ జిలాలోనే కొనసాగుతాయి. అయితే అభ్యర్థుల్లో వివిధ కేటగిరీల్లో ఎన్ని పోస్టులు వేకెన్సీలుగా ఉన్నాయి.. అందులో ఎన్ని భర్తీ చేస్తారనే అంశం ఆసక్తిగా మారింది. రాష్ట్రంలో మాత్రం 5,089 టీచర్ పోస్టులు మాత్రమే భర్తీచేస్తారని, స్పెషల్‌ఎడ్యూకేషన్ లో1523 టీచర్‌పోస్టులు భర్తీచేయబోతున్నారని సమాచారం. అంతకంటే ఎక్కువగానే పోస్టులు వేకెన్సీలుగా ఉన్నాయి. విద్యార్థుల సంఖ్యను బట్టే వేకెన్సీలను భర్తీచేయబోతున్నారని సమాచారం.

హనుమకొండ జిల్లాలో 318 పోస్టులు ఖాళీ..

హనుమకొండ జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి 2,693 పోస్టుల మంజూరు ఉండగా అందులో 2,375మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. 318 పోస్టులు వేకెన్సీలుగా ఉన్నాయి. గ్రేడ్ 1 హెచ్ఎం పోస్టులు ఒకటి వేకెన్సీగా ఉండగా గ్రేడ్ హెచ్ఎంలు 46 ఉన్నాయి.ఎస్‌జీటీ తెలుగు మీడియం 74, ఉర్దూమీడియం 8 పోస్టులు వేకెన్సీగా ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్స్ మ్యాథ్స్ 7, ఫిజిక్స్ 4, బయోసైన్స్ 17, సోషల్‌స్టడీస్ 38 , తెలుగు 9, హిందీ 8, ఉర్దూ 1, ఫిజికల్ ఎడ్యూకేషన్ 5, పీఎస్‌హెచ్‌ఎం 45,ఎల్‌పీ తెలుగు 2, ఎల్‌పీ హిందీ 3, పీఈటీ 6, ఆర్ట్ డ్రాయింగ్ టీచర్ 8, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్స్ 17, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ 4 వేకెన్సీలుగా ఉన్నాయి.

జనగామ జిల్లాలో 426 పోస్టులు..

జనగామ జిల్లాలో అన్ని కేటగిరీల కలిపి 426 టీచర్ పోస్టులు వేకెన్సీలుగా ఉన్నాయి. జిల్లాలో 2,570 కేడర్ స్ట్రెంత్ (పోస్టుల మంజూరు) ఉండగా అందులో 2,144మంది పనిచేస్తున్నారు.హెచ్‌ఎం పోస్టులు 49, పీఎస్‌హెచ్‌ఎం పోస్టులు 57, స్కూల్ అసిస్టెంట్‌లు 167, ఎస్‌జీటీ పోస్టులు 118, పండిట్లు 21, పీఈటీలు 7వేకెన్సీలుగా ఉండగా ఇంకా వివిధ కేటగిరీలో పోస్టులు వేకెన్సీలుగా ఉన్నాయి.

మహబూబాబాద్‌జిల్లాలో 595..

మహబూబాబాద్‌జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి 595 టీచర్ పోస్టులు వేకెన్సీలుగా ఉన్నాయి. జిల్లాలో 3,681 టీచర్ల కేడర్ స్ట్రెంత్ ఉండగా అందులో 3,086 మంది పనిచేస్తున్నారు.595 వేకెన్సీలుగా ఉన్నాయి. హెచ్‌ఎం పోస్టులు 39, పీఎస్‌హెచ్‌ఎం 70, మ్యాథ్స్ 20, ఫిజిక్స్ 8, బయోసైన్స్ 53, సోషల్‌స్టడీస్ 62, తెలుగు 18, హిందీ 10, ఇంగ్లిష్ 24, ఫిజికల్ ఎడ్యూకేషన్ 8 ఎల్‌పీ తెలుగు 14, ఎల్‌పీ హిందీ 5, పీఈటీ 2, ఎస్‌జీటీ పోస్టులు 262 వేకెన్సీలుగా ఉన్నాయి.

- వరంగల్‌జిల్లాలో అన్నికేటగిరీల టీచర్ పోస్టులుకలిపి 490వరకు వేకెన్సీలుగా ఉన్నాయని సమాచారం,
- ములుగు జిల్లాలో 300లకుపైగా టీచర్‌పోస్టులు వెకెన్సీలుగా ఉన్నాయని సమాచారం.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోఅన్ని కేటగిరీలు కలిపి 325కుపైగా టీచర్ పోస్టులు వేకెన్సీలుగా ఉన్నాయని సమాచారం. వేకెన్సీల్లో కొంతశాతం పదోన్నతుల ద్వారా, మరికొంత డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేస్తారు.జిల్లా కలెక్టర్లు విధివిధానలను ప్రకటించాకా త్వరలోనే నోటిఫికేషన్ కూడా ఇస్తారనేది సమాచారం.

సర్కారు బడికే జై..

- తన కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన తహసీల్దార్
- అభినందించిన పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు



కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్న తహసీల్దార్ సరస్వతి

చిల్పూరు : ప్రస్తుత కాలంలో సామన్యుల నుంచి.. సంపన్నుల వరకు.. నిరక్షరాస్యుల నుంచి.. ఉన్నత విద్యావంతుల వరకు.. కిందిస్థాయి సిబ్బంది నుంచి.. ఉన్నతాధికారుల వరకు అందరూ తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఫలితంగా విద్యార్థులు లేక ప్రభుత్వ పాఠశాలలు మూతబడే పరిస్థితులు నెలకొంటున్నాయి. అయితే వీరందరికీ చిల్పూరు తహసీల్దార్ సరస్వతి భిన్నం. తన కుమారుడు శ్రీవర్ధన్‌ను గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతిలో చేర్పించారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్లు పేరు నమోదు చేసుకుని పుస్తకాలు అందజేసి తరగతిగదిలో కుర్చోబెట్టారు. దీంతో తహసీల్దార్‌పై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాధాకృష్ణ, వేణు, మంజుల, వెంకటరమణాచార్య, ఎస్ఎంసీ చైర్మన్ పంతం రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

గుడిసెల తొలగింపు.. సీపీఎం ఆందోళన



పోచమ్మమైదాన్ జంక్షన్‌లో రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

రామన్నపేట : దేశాయిపేట శివారు ప్రభుత్వ భూమిలో వెలిసిన 1600 గుడిసెలను పోలీసులు బుధవారం అర్ధరాత్రి తొలగించారు. గుడిసెల తొలగింపుకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో గురువారం పోచమ్మమైదాన్ జంక్షన్‌లో రాస్తారోకో, ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య మాట్లాడుతూ పోలీసులు నిర్దాక్షణ్యంగా గుడిసెలు నేలమట్టం చేశారని మండిపడ్డారు. గుడిసెలు వేసుకున్న పేదలకు ప్రభుత్వం వెంటనే ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు పూర్తయినా ఇండ్లు లేని నిరుపేదలకు ఇంత వరకు స్థలాలు కేటాయించలేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నలిగంటి రత్నమాల, సింగరాపు బాబు, ముక్కెర రామస్వామి, జిల్లా కమిటీ సభ్యులు సాగర్, అరూరికుమార్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు కబ్జారాయుళ్ల పై పీడీ యాక్ట్



నిందితులకు పీడీ యాక్ట్ ఉత్తర్వులు అందజేస్తున్న సీఐలు

వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు కబ్జారాయుళ్లపై సీపీ రంగనాథ్ పీడీ యాక్ట్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏనుమాములలో నివాసముంటున్న జన్ను అనిల్, గీసుకొండ మండలం కీర్తినగర్ ప్రాంతానికి చెందిన పోలెపాక విజయ్‌పై పీడీ యాక్ట్ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు ఇంతేజార్‌గంజ్, మిల్స్ కాలనీ సీఐలు శ్రీనివాస్, సురేష్ గురువారం హైదరాబాద్‌లోని చర్లపల్లి కారాగారంలో జైలర్ సమక్షంలో వారికి పీడీ యాక్ట్ ఉత్తర్వులు అందజేశారు. నిందితులు ఖాళీ స్థలాలపై కన్నేసి తప్పుడు ధ్రువపత్రాలను సృష్టించి వాటి ద్వారా అసలు స్థల యజమానులను బెదిరిస్తూ భూ కబ్జాలకు పాల్పడడంతో పాటు ఇబ్బందులకు గురిచేసేవారని తెలిపారు. ఈ తరహా కేసుల్లో జన్ను అనిల్‌పై ఇంతేజార్‌గంజ్ పీఎస్ పరిధిలో రెండు, పోలెపాక సంజీవ్ పై మిల్స్ కాలనీ పీఎస్ పరిధిలో మూడు కేసులు నమోదైనట్లు తెలిపారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు



మహిళాసంఘాల సభ్యులకు చెక్కు అందజేస్తున్న మంత్రి

పాలకుర్తి : తెలంగాణ రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల బలోపేతమే సీఎం కేసీఆర్ లక్ష్యమని, రుణాలు పొందిన మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం పాలకుర్తిలో నిర్వహించిన మహిళా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన అనంతరం సీఎం కేసీఆర్ నేతృత్వంలో స్వయం సహాయక సంఘాలకు రూ. 20 వేల కోట్లు రుణాలు ఇచ్చామన్నారు. ఇప్పటికే ప్రతీ మహిళకు రూ. 3 లక్షల రుణాలు అందజేశామన్నారు. ఈ డబ్బుతో మహిళలు వివిధ ఉపాధి మార్గాల ద్వారా ఆర్థికంగా ఎదిగారన్నారు. రాష్ట్రంలో 4 లక్షల 50 వేల సంఘాల్లో 45 లక్షల పైగా సభ్యులు ఉన్నారన్నారు. రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన ప్రతీ మహిళ సంఘంలో సభ్యురాలిగా ఉండాలన్నారు. ఎర్రబెల్లి ట్రస్ట్ చైర్ పర్సన్ ఉషాదయాకర్‌రావు మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వం అందజేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మంత్రి ఎర్రబెల్లి.. మహిళా సంఘాల సభ్యులకు రూ. 5 కోట్లు విలువైన రుణాలు అందజేశారు. సమావేశంలో అడిషనల్ డీఆర్‌డీవో నూరోద్దీన్, ఎంపీపీ నాగిరెడ్డి, జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, ఆపరేషన్ ఎస్‌బీఐ షేక్‌అబ్దుల్ రహీం, మార్కెట్ చైర్మన్ ముస్కు రాంబాబు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, సహకార సొసైటీ చైర్మన్ బొబ్బాల అశోక్ రెడ్డి, వీరమనేని యాకాంతరావు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రామన్నపేట : వరంగల్ లోకల్ బస్టాండ్ ప్లాట్‌ఫాం నంబర్-1 వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు ఇంతేజార్ గంజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. మృతుడు 50 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉంటాడని తెలిపారు. సన్నగా నలుపురంగుతో ఆకుపచ్చ లుంగీ, గ్రే కలర్ చెక్స్ కలిగిన ఫుల్ షర్టు కలిగి ఉన్నాడని తెలిపారు. ఈ మృతదేహాన్ని వరంగల్ బస్టాండ్‌లో ప్యాసింజర్ గైడ్‌గా విధులు నిర్వహిస్తున్న గంజి రాజేందర్ గురువారం ఉదయం 6 గంటల ప్రాంతంలో గుర్తించారన్నారు. సదరు వ్యక్తికి స్పృహ లేకపోవడంతో 108కు సమాచారం అందించినట్లు తెలిపారు. 108 సిబ్బంది అక్కడికి చేరుకుని పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించిందన్నారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

మార్కెట్‌లోకి హెచ్‌పీ ఫ్లేమ్‌ప్లస్ గ్యాస్



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మహేశ్‌రామ్, గ్యాస్ డీలర్లు

హన్మకొండ అర్బన్ : నగరంలోని కమర్షియల్ గ్యాస్ వినియోగదారుల కోసం హెచ్‌పీ(హిందుస్థాన్ పెట్రోలియం) గ్యాస్ ఆధ్వర్యంలో వినూత్నంగా ఫ్లేమ్ ప్లస్ సిలిండర్లను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు సంస్థ సౌత్ సెంట్రల్ జోన్ జీఎం మహేశ్‌రామ్ తెలిపారు. ఈ మేరకు గురువారం సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ ఫ్లేమ్ ప్లస్ సిలిండర్లను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లేమ్ ప్లస్ గ్యాస్ వినియోగంతో అధిక ఉష్ణోగ్రత, అధిక సామర్థ్యం, తక్కువ గ్యాస్ ఖర్చు అవుతుందన్నారు. సమపాళ్లలో ఉష్ణోగ్రత, మంట నిలకడగా రావడం వల్ల సమయం ఆదా అవుతుందని, తద్వారా 10 శాతం వరకు గ్యాస్ ఆదా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ డీజీఎం మనోజ్ గోయల్, హెచ్‌పీ డీలర్స్ ఏ.వి సత్యమోహన్, పి.వెంకటేశ్వరావు, రామకృష్ణ రాజు, మోహన్ రెడ్డి, రాజిరెడ్డి, రమేష్, శంకర్, మనుకార్తీ, శ్యాంకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి హత్య కేసులో దర్యాప్తు వేగవంతం

- బృందాలుగా వీడిన పోలీసులు..
- నిందితుల కోసం గాలింపు

ఖిలా వరంగల్: వరంగల్ కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోటలో సంచలనం రేకెత్తించిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి నాముతాబాజీ రాంచందర్(65) హత్య కేసులో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. సీపీ ఏవీ రంగనాథ్ ఆదేశాలు మేరకు ఏసీపీ బోనాల కిషన్ ఆధ్వర్యంలో సీఐ సురేష్ నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్, స్టేషన్ పోలీసులు నాలుగు బృందాలుగా వీడి నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు. వృద్ధుడిని హత్య చేసి పరారైన ఇద్దరు వ్యక్తులు నంబర్ ప్లేట్ లేని ద్విచక్రవాహనంపై ఎటువైపు వెళ్లారు? బైక్‌ను ఎక్కడ పడేసి ఉంటారు? లేదా బైక్‌పై ప్రయాణం చేసి ఉంటారా? అనే అంశంపై దర్యాప్తు చేపడుతున్నారు. ఘటనా స్థలిలో క్లూస్ టీం సేకరించిన ఆధారాలను కూడా పోలీసులు పరిగణలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. మృతుడి కుమారుడు ప్రదీప్‌చందర్ పేర్కొనట్లు 'గతంలో పత్తిపాక శాయంపేటకు చెందిన ఓ వ్యక్తికి మృతుడు రాంచందర్ మధ్య భూ వివాదం కొనసాగుతోంది. ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తోంది. భూ వివాదంలో భాగస్వామి అయిన వ్యక్తే రాంచందర్‌ను హత్య చేసి ఉంటాడా..?' అనే విషయాన్ని ఆరాతీస్తున్నారు. హత్యకు గురైన వృద్ధుడితో వివాదం ఉన్న వ్యక్తితో పరిచయం ఉన్న వ్యక్తులను కూడా విచారించి వదిలేసినట్లు తెలుస్తోంది. వృద్ధుడి కుటుంబ సభ్యులను కూడా పోలీసులు అనుమానిస్తున్నట్లు తెలుస్తోంది. వారిని కూడా విడివిడిగా విచారించే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాగా, వృద్ధుడి హత్యకు సుపారీ ఇచ్చినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నవజాత శిశువు మృతి

- ఆస్పత్రి ఎదుట కుటుంబీకుల ఆందోళన
- బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీసీహెచ్ఎస్ హామీ



పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబీకులు

పాలకుర్తి : ఓ నవజాతి శిశువు మృతి చెందింది. ఈ ఘటన పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగింది. మండలంలోని దర్దేపల్లి గ్రామానికి చెందిన జిట్టబోయిన రామలీల, సోమమల్లయ్య దంపతుల కూతురు స్రవంతికి జఫర్‌గఢ్ మండలంలోని ఓబులాపురం గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌తో వివాహం జరిగింది. ప్రస్తుతం స్రవంతి గర్భం ధరించి ప్రసూతి నిమిత్తం తల్లిందండ్రుల వద్ద ఉంటోంది. ఈ క్రమంలో గురువారం పురిటి నొప్పులు రావడంతో పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. ఈ సమయంలో డాక్టర్ స్వప్న అందుబాటులో లేరు. దీంతో ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న స్టాఫ్ నర్స్ సరిత మైనర్ ఆపరేషన్ చేసింది. అయితే శిశువుకు చలనం లేకపోవడంతో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే శిశువు మృతి చెందినట్లు అక్కడి వైద్యులు ధ్రువీకరించారు.

స్టాఫ్ నర్స్ ఆపరేషన్ చేయడంతోనే శిశువు మృతి..

డ్యూటీ డాక్టర్ అందుబాటులో లేని సమయంలో స్టాఫ్ నర్స్ ఆపరేషన్ చేయడంతోనే శిశువు మృతి చెందిందని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలిసిన డీసీహెచ్ఎస్ సుగుణాకర్‌రాజు, ఏసీపీ సురేష్, సీఐ విశ్వేశ్వర్, ఎస్ఐ శ్రీకాంత్ హుటాహుటినా పాలకుర్తి ఆస్పత్రికి చేరుకున్నారు. ఈ ఘటనపై విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు శాంతించారు.

పెన్షన్ కోసం వెళ్లి అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం



బుచ్యా(ఫైల్)

ఖానాపురం: రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన గురువారం మండలంలోని మంగళవారిపేటలో జరిగింది. నాజీతండాకు చెందిన అజ్మీరా బుచ్యా(81), భద్రు పెన్షన్ డబ్బులు తీసుకోవడానికి ద్విచక్ర వాహనంపై తండా నుంచి మంగళవారిపేటకు వచ్చారు. డబ్బులు తీసుకుని వెళ్లడానికి సిద్ధమయ్యారు. ఈ క్రమంలో మహబూబాబాద్ వైపు నుంచి నర్సంపేట వైపునకు వెళ్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో బుచ్యాకు తీవ్ర గాయాలుకావడంతో వరంగల్ ఎంజీఎం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, భద్రుకు స్వల్ప గాయాలు కావడంతో నర్సంపేట ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి భార్య వీరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మాధవ్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ గ్రామానికి చెందిన నీలిగొండ వీరాంజన్(32) గురువారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లిదండ్రులు వేరే ఊరికి వెళ్లి తిరిగి వచ్చి చూడగా వీరాంజన్ ఉరేసుకుని మృతి చెంది ఉన్నాడు. కాగా, నేలపై, మృతుడి కాళ్లకు రక్తం మరకలు ఉండడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయిబాబు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మహిళ అదృశ్యం

రఘునాథపల్లి: మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన ఎడ్ల శ్రీలత తన కూతురుతో కలిసి గురువారం అదృశ్యంది. బుధవారం ఉదయం కూతురును పాఠశాలకు తీసుకెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన శ్రీలత తిరిగి రాలేదు. దీంతో బంధువులు, చుట్టుపక్కల వెతకగా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబీకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.